# దైవ కుమారుడు

## (యోహాను సువార్త సంగ్రహ సమీక్ష)

**A. ఉపోద్ఘాతము :** ఒక నాణానికి ఇరు పార్శ్వాలు ఎలా ప్రాముఖ్యమో అలా, యేసు క్రీస్తును అర్థం చేసికోడానికి ఆయన మానవత్వము మరియు దైవత్వమును గూర్చి తెలిసికోవడం అవసరం. ఆయన దైవత్వాన్ని స్పష్టంగా వివరించిన క్రొత్తనిబంధన పుస్తకం యోహాను.

1. **గ్రంథకర్త :** యేసు ప్రేమించిన శిష్యుడైన యోహాను ఈ గ్రంథాన్ని వ్రాసాడు. ఇతని తండ్రి జెబదయి, తల్లి సలోమి, సహోదరుడు యాకోబు. యేసు యోహానును పిలిచినప్పుడు అతనికి 25 సం॥ల వయస్సు ఉండవచ్చును. ప్రభువుకు అత్యంత సన్నిహితమైన శిష్యులలో ఇతడు ఒకడు. డొమిషియన్ చక్రవర్తి పరిపాలనలో యోహాను పత్మాసు ద్వీపానికి పంపించబడ్డాడు. అక్కడే ప్రకటన గ్రంథంలోని ప్రత్యక్షతలను పొందాడు. తరువాత అతడు ఎఫెసు సంఘానికి కాపరిగా ఉన్నాడు. ఈ కాలంలోనే యోహాను సువార్తను వ్రాసాడు. ఇతడు శిష్యులందరికంటె ఎక్కువ కాలం బ్రతికాడు.
2. **గ్రంథ రచనకాలం :** మిగతా సువార్తికుల తరువాత ఒక తరం అనంతరం యోహాను తన సువార్తను వ్రాసాడు. అనగా మొదటి శతాబ్దం చివరలో క్రీ. శ. 69-90 సం॥లో ఈ సువార్త వ్రాయబడింది.
3. **ఉద్దేశం :** ఈ సువార్త వ్రాయబడిన కాలంనాటికే యేసు క్రీస్తు జీవితం మరియు పరిచర్యను గూర్చి అందరికి తెలుసు. అనేక దేశాలలో సువార్త ప్రకటించబడింది. పేతురు మరియు పౌలు హతసాక్షులయ్యారు. అపొస్తలులందరు చనిపోయారు. యోరూషలేము నాశనం చేయబడింది. అప్పటికే అబద్ధబోధకులు బయలుదేరారు. వారు యేసు క్రీస్తు శరీరధారిగా వచ్చాడన్న సత్యాన్ని తృణీకరించారు. దేవుని కుమారుడు శరీరధారిగా ఈ లోకానికి వచ్చాడని, యేసు క్రీస్తు మెస్సీయా అని యూదులకు, మరియు ఆయన దేవుని కుమారుడని అన్యులకు నిరూపించడానికి యోహాను ఈ సువార్తను వ్రాసాడు.
4. **యోహాను సువార్త మూల వచనం :** "యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను." 20:31, ఈ సువార్తలో "నమ్ముట" అనే మాట 98 సార్లు ఆలాగే "నా తండ్రి" అన్న మాట 35 సార్లు, "నిశ్చయముగా" అన్న మాట 25 సార్లు వ్రాయబడింది.
5. **యోహాను సువార్త విశిష్టత :** మత్తయి, లూకా సువార్తల వలె యోహాను సువార్తలో యేసు క్రీస్తు వంశావళిగాని, జన్మవృత్తాంతంగాని ఆయన బాల్యమును గూర్చిన వివరాలుగాని లేవు. ఆలాగే ఆయన శోధన, శిష్యులను ఏర్పరచుకొనుట, ఉపమానాలు, రూపాంతరము, ఆరోహణము, చివరి ఆజ్ఞ మొదలైనవేవి లేవు.

అలాగే యోహాను సువార్తలోని "దేవుని వాక్యము", "అద్వితీయ కుమారుడు", "దేవుని గొఱ్ఱెపిల్ల" అనే బిరుదులు మరే సువార్తలోను లేవు. ఆయన తనను గూర్చి "నేనే" అని



చెప్పుకొన్న బిరుదులు యోహాను సువార్తకు తలమానికలు.

మరో ప్రాముఖ్యమైన విషయమేమంటే యేసు ప్రభువు చేసిన అద్భుతాల ద్వారా ఒక ఆధ్యాత్మిక సత్యాన్ని బోధించాడు గనుక వాటిని యోహాను సూచక క్రియలుగా పేర్కొన్నాడు.

యేసు క్రీస్తు పరిచర్య కాలమును యోహాను సువార్తలోని మూడు పస్కాపండుగలను ఆధారము చేసికొని చెప్తారు. ఆయన మొదటిసారి దేవాలయాన్ని శుద్ధిచేసినది మొదలుకొని సిలువ వేయబడక ముందు చివరివారము వరకు 3 పస్కాపండుగలు 2:12; 6:4; 11:55 (మరో పేరు వ్రాయబడని పండుగ 5:1) ను బట్టి ఆయన 3 సం॥లు పరిచర్య చేసాడని చెప్తారు. యేసు దేవుని కుమారుడని తెలిపే 7 సాక్ష్యాలు ఈ సువార్తలో ఉన్నాయి.

బాప్తిస్మమిచ్చు యోహాను (1:34) నతనయేలు (1:49) పేతురు (6:69) మార్త (11:27) యేసు (10:35,36) తోమా (20:28) అపొస్తలుడైన యోహాను (20:31).

### B. యోహాను సువార్త గ్రంథవిభజన :

**I. ముందుమాట - మానవావతారం 1:1-18 :**

**II. ఉపోద్ఘాతం (1:19-51 అధ్యా) :**

| | | |
|---|---|---|
| 1. | బాప్తిస్మమిచ్చు యోహాను సాక్ష్యం | (1:19-36) |
| 2. | అంద్రెయ సాక్ష్యం | (1:37-42) |
| 3. | ఫిలిప్పు సాక్ష్యం | (1:43-46) |
| 4. | నతనయేలు సాక్ష్యం | (1:47-51) |

**III. క్రియల, మాటల సాక్ష్యం (2-12 అధ్యా) :**

| | | |
|---|---|---|
| 1. | కానాలో వివాహం (మొదటి క్రియ) | (2:1-12) |
| 2. | పస్కా సమయంలో దేవాలయాన్ని శుద్ధీకరించుట (మొదటి మాట) | (2:13-22) |
| 3. | యేసు నీకొదేముతో సంభాషించుట (రెండవ మాట) | (2:23-3:36) |
| 4. | సుఖారులోని బావి వద్ద స్త్రీతో సంభాషించుట (మూడవ మాట) | (4:1-45) |
| 5. | కపెర్నహూములోని ప్రధాని కుమారుని స్వస్థపరచుట (రెండవ క్రియ) | (4:46-54) |
| 6. | బేతెస్థ కోనేటి వద్ద రోగిని స్వస్థపరచుట (మూడవ క్రియ) | (5 అధ్యా) |
| 7. | గలిలయ తూర్పు దిక్కున 5000 మందిని పోషించుట (నాల్గవ క్రియ మరియు మాట) | (6 అధ్యా) |
| 8. | దేవాలయంలో పర్ణశాలల పండుగలో బోధించుట (5వ మాట) | (7 అధ్యా) |
| 9. | వ్యభిచారములో పట్టబడిన స్త్రీని క్షమించుట (6వ మాట) | (8 అధ్యా) |
| 10. | యేసు పుట్టు గ్రుడ్డివాని కండ్లు తెరచుట (5వ క్రియ) | (9 అధ్యా) |
| 11. | యేసు మంచి కాపరి (7వ మాట) | (10 అధ్యా) |
| 12. | బేతనియలో లాజరును మరణమునుండి లేపుట (6వ క్రియ) | (11 అధ్యా) |
| 13. | యేసును గూర్చి యూదుల, అన్యుల సాక్ష్యము | (12 అధ్యా) |

**IV. యేసు తన సాక్షులకు తనను గూర్చి సాక్ష్యమిచ్చుట (మేడగది ప్రసంగం) (13-17 అధ్యా) :**

1. యేసు శిష్యుల పాదాలు కడుగుట (13 అధ్యా)
2. యేసు శిష్యులనోదార్చుట (14 అధ్యా)
3. యేసు నిజమైన ద్రాక్షావల్లి, శిష్యులు తీగెలు (15 అధ్యా)
4. యేసు తనస్థానంలో పరిశుద్ధాత్మను పంపిస్తాడు (16 అధ్యా)
5. ప్రభువు ప్రార్థన (17 అధ్యా)

**V. యేసు లోకానికి సాక్ష్యమిచ్చుట (18-20 అధ్యా) :**

1. యేసు బంధించబడుట, తీర్పుతీర్చబడుట (18 అధ్యా)
2. గొల్గొతాపై యేసు మరణం (19 అధ్యా)
3. యేసు పునరుత్థానం (20 అధ్యా)

**VI. ముగింపు - యేసు మహిమ పర్చబడుట (21 అధ్యా) :**

యోహాను సువార్త అంతటిని అందలి సందేశాన్ని బట్టి మూడు ప్రధాన భాగాలుగా విభజించవచ్చును.

1-12 అధ్యాయాలు - వెలుగు
13-17 అధ్యాయాలు - ప్రేమ
18-21 అధ్యాయాలు - జీవము

## C. అంశాలవారిగా సంగ్రహ సమీక్ష :

**I. మొదటి భాగం - దైవ కుమారుని మానవావతారము. (1:1-18)**

1. **క్రీస్తు దైవత్వం 1:1,2 :** యోహాను సువార్తలో మనము క్రీస్తు జన్మ వివరణ చూడము. విశ్వాసులు ఆత్మీయంగా అభివృద్ధి చెందాలని ఆశించిన యోహాను మనల్ని బేత్లెహేముకు తీసికొని వెళ్ళలేదు గాని సువిశాలమైన శూన్యం గుండా నిత్యత్వపు నిశ్శబ్ద ప్రాంగణంలోనికి తీసికొని వెళ్ళాడు. ఈ ప్రపంచ ఉత్పత్తికి పూర్వం ఉన్న నిత్యత్వంలోనికి మనం తొంగి చూస్తే అక్కడ నుండి ప్రభువు మనల్ని ఎదుర్కోడానికి వస్తాడు. యేసు క్రీస్తుకు ఆరంభంలేదు. ఆయన శాశ్వతుడు. ఆయన అన్నిటి కంటె ముందు ఉన్నవాడు. ఆయన దైవత్వంలో ఒక వ్యక్తి "ఆ వాక్యము దేవుడైయుండెను."
2. **మానవావతారానికి ముందున్న క్రీస్తు (1:3-5) :** యేసు క్రీస్తు సృష్టికర్త గనుక, ఆయన సృష్టిలో ఒక భాగముకాదు. (కొల 1:10; హెబ్రీ 1:2).
3. **క్రీస్తుకు ముందుదూత (1:6-8) :** యోహాను సువార్తలో బాప్తిస్మమిచ్చు యోహాను గూర్చి కూడ ప్రత్యేకంగా వ్రాయబడింది. మత్తయి సువార్తలో అతడు రాబోవు రాజ్యమును గూర్చి, మార్కు మరియు లూకా సువార్తలలో మారుమనస్సును గూర్చి ప్రకటించినట్లు వ్రాయబడింది. యోహాను సువార్తలో, అందరు యేసు క్రీస్తును విశ్వసించాలని అతడు ఆ వెలుగుకు సాక్షిగా ఉన్నాడు (1:7).
4. **క్రీస్తును తృణీకరించుట (1:9-11) :** వాక్యమైన యేసుక్రీస్తు శరీరధారిగా వచ్చినప్పుడు ఆయన స్వకీయులే ఆయనను తృణీకరించారు. ఈ సువార్త అంతటిలో ప్రజలను ప్రభువు రెండు వర్గాలుగా విభజించాడు. కొంతమంది ఆయనను విశ్వసించారు, కొంతమంది తృణీకరించారన్నది నిజమే కాని అందరూ తృణీకరించలేదు.
5. **క్రీస్తును స్వీకరించుట (1:12,13) :** రక్షణ పొందడానికి ఏమి చేయాలో దాని ఫలితం ఏంటో 1:12 లోను; ఏది రక్షణ కాదో 1:13 లోను వ్రాయబడింది. రక్షణ రక్త సంబంధం వలన వంశ పారంపర్యంగా రాదు. లేక నిత్యజీవం పొందడానికి మనిషి చేసే ప్రయత్నాల వలన గాని శరీర సంబంధమైన విద్య, సంస్కృతులు పేరు ప్రతిష్టలను బట్టిగాని లభించదు. కాని దేవుని వలన, అనగా పరిశుద్ధాత్మ శక్తి ద్వారా క్రొత్త జన్మను పొందడం ద్వారానే మనము దేవుని పిల్లలమౌతాము.
6. **క్రీస్తు మానవావతారము (1:14-18) :** "ఆది యందు వాక్యముండెను" అని ప్రారంభించిన యోహాను మరో అడుగు ముందుకు వేసి వాక్యము శరీరధారియై కృపాసత్యసంపూర్ణునిగా మన మధ్య నివసించెను" (1:14) అని వ్రాసాడు. ఎవరు ఎప్పుడు దేవుణ్ణి చూడలేదు. తండ్రి రొమ్ముననున్న ఆయన కుమారుడే ఆయనను బయలుపరచాడు. క్రీస్తు దేవుని వాక్కుగా పలికాడు. దేవుణ్ణి ప్రత్యక్షపర్చాడు. మనిషి పాపం చేసి దేవుని స్వరూపాన్ని పోగొట్టుకున్నాడు. కనుక క్రీస్తు అదృశ్యుడైన దేవుని స్వరూపంగా మనిషిలో నివసించాలని వచ్చాడు (కొల 1:15) ఇక్కడ ఒక సత్యాన్ని గమనించాలి ఆయన శరీరధారియైనంత మాత్రాన తన దైవత్వాన్ని విడనాడలేదు.

**II. రెండవ భాగము - దైవ కుమారుని ప్రదర్శన. (1:19-4:54)**

1. **బాప్తిస్మమిచ్చు యోహాను క్రీస్తును ప్రదర్శించుట :** బాప్తిస్మమిచ్చు యోహానునుగూర్చి యూదులకు పలు ప్రశ్నలున్నాయి. కనుక అతడు ఎవరో తెలిసికోడానికి యెరూషలేము నుండి యాజకులను లేవీయులను పంపించారు. బాప్తిస్మమిచ్చు యోహాను తనను పరిచయం చేసికొన్న విధానంలో ఎంతో తగ్గింపు కనిపిస్తుంది. (1:23) క్రీస్తును హెచ్చించాడు. ఆయనే మెస్సీయా అని దేవుని కుమారుడని సాక్ష్యాధారాలతో నిరూపించాడు. (1:29-34).
2. **క్రీస్తు బాప్తిస్మమిచ్చు యోహాను శిష్యులకు ప్రదర్శించుకొనుట. (1:35-51) :** యోహాను క్రీస్తును గూర్చి ఇచ్చిన సాక్ష్యాన్ని బట్టి అతని శిష్యులలో ఇద్దరు ఆయనను వెంబడించారు (1:37) అనగా వారు తమ నాయకుణ్ణి మార్చుకొన్నారు. వారిలో ఒకడు పేతురు సహోదరుడైన అంద్రెయ మరొకరు ఈ సువార్త గ్రంథకర్తయైన యోహాను. అంద్రెయ మాట విని వచ్చిన సీమోను పేతురు పేరు మార్చబడింది. (1:42). ఆలాగే ఫిలిప్పు తన దిశను మార్చుకొన్నాడు (1:43) అతని ద్వారా వచ్చి నతనయేలు తన ఉద్దేశాన్ని మార్చుకొన్నాడు (1:46-49). క్రీస్తును కనుగొన్న వారి జీవితాలు, మార్గాలు, ఉద్దేశాలన్నీ మారిపోతాయన్నది ఎంతైన

వాస్తవం. అలా మారలేదు అంటే వారు వాస్తవంగా క్రీస్తును వ్యక్తిగతంగా ఎరుగలేదని అర్థం. క్రీస్తు జీవితాలను మార్చేవాడు. యేసు నతనయేలుతో చెప్పి మాటలలో తన ఆరోహణమును గూర్చిన మొదటి ప్రస్తావన ఉన్నది. (1:51). ఈ మాటల నెరవేర్పును, అపొస్తలుల కార్యములు 1:9-11లో చూడగలము. నతనయేలు ఆయనను ఇశ్రాయేలు రాజుగా గుర్తించాడు. కాని యేసు తనను గూర్చి మనుష్యకుమారుడు అని మాత్రము చెప్పుకొన్నాడు.

3. **క్రీస్తు గలిలయలో ప్రదర్శించుకొనుట (2:1-12) :** కానాలో ఆయన చేసిన మొదటి సూచక క్రియను బట్టి ఆయన శిష్యులు ఆయన యందు విశ్వాసముంచారు. ఆయన రాతి బానలను వాడుకొన్నట్లే, మనము అనుమతిస్తే మంటి ఘటాలైన మనల్ని కూడ వాడుకొంటాడు. దేవుని వాక్యంతో మనల్ని నింపుతాడు. మనము దానిలో నుండి ముంచి ఇతరులకు ఇస్తున్నప్పుడు వారికి వారికి అది ఆత్మ అనే ద్రాక్షారసంగా మారిపోతుంది.

4. **క్రీస్తు యూదయలో ప్రదర్శించుకొనుట (2:13-3:36) :**

అ) పస్కాపండుగ సందర్భంగా యేసు క్రీస్తు యెరూషలేము దేవాలయానికి వెళ్ళడం, దేవాలయాన్ని శుద్ధిచేయడం ఈ భాగంలో కనిపిస్తుంది. ఆయన చేసిన ఈ కార్యాన్ని నిరూపించుకొనేందుకు సూచక క్రియను చూపించమని యూదులు అడిగారు. అందుకు యేసు "ఈ దేవాలయమును పడగొట్టుడి, మూడు దినములలో దాని లేపుదునని" వారితోచెప్పాడు (2:19). వాస్తవంగా యేసు తన మరణ పునరుత్థానాలను గూర్చి ఈ మాటలు చెప్పాడు కాని వారు హేరోదు కట్టించిన మందిరాన్ని గూర్చి అని తలంచారు. ఆయనను పట్టుకొన్నప్పుడు కూడ దీనిని గూర్చే నేరారోపణ చేసారు. (మత్త 26:61; 27:40; మార్కు 15:19).

ఆ) రాత్రివేళ నీకొదేము యేసునొద్దకు వచ్చుట (3:1-21).
ఈ భాగంలో నీటి మూలముగాను ఆత్మ మూలముగాను జన్మించుటను గూర్చి పలు అభిప్రాయాలున్నాయి.

(i) ఈ మాటలు తిరిగి జన్మించిన తరువాత పొందే బాప్తిస్మమునకు సంబంధించినవి అని కొంతమంది అభిప్రాయం. కాని అది సరైనదికాదని కొన్ని లేఖనాలు చెప్తున్నాయి. (ఎఫె 2:8,9; రోమా 5:1; I కొరి 1:17).

(ii) భౌతిక జన్మ సమయంలో నీటితో శుద్ధీకరించే విధానాన్ని ఆత్మీయ జీవితానికి పోలుస్తూ నూతన జన్మ సమయంలో ఆత్మద్వారా శుద్ధీకరించబడాలని యేసు చెప్పాడని మరికొంతమంది అభిప్రాయము.

(iii) పరిసయ్యులు నిరాకరించిన యోహాను బాప్తిస్మం గూర్చి ఆయన ఈ మాటలు చెప్పాడని మరికొంతమంది అభిప్రాయం. (లూకా 3:3; 7:30).

(iv) వాస్తవంగా యేసు ఈ సందర్భంలో ఒక వ్యక్తి రక్షణ పొందడానికి అవసరమైన దేవుని వాక్యమును నీళ్ళతో, పరిశుద్ధాత్మను ఆత్మతో పోల్చి, చెప్తున్నాడని మరి కొందరి అభిప్రాయం. ఈ రెండు లేకుండ ఎవరూ రక్షించబడలేరు. (యోహా 16:8-11; రోమా 10:17; యాకో



1:18; తీతు 3:5; I థెస్స 1:5,6).

నీకొదేము మతనాయకుడు, బోధకుడు అయినా, అతనికి క్రొత్త జన్మ అవసరమైంది. అతని ఈ అవసరతను తీర్చడానికి యేసు ఇత్తడి సర్పాన్ని గూర్చి సాదృశ్యంగా చెప్పాడు (3:14; సంఖ్యా 21:9). ఈ సత్యాన్ని అర్థం చేసికొన్నవారే యోహాను 3:16 ను అర్థం చేసికోగలుగుతారు. ప్రియ పాఠకులారా పాపమనే సర్పకాటుకు గురైన మానవాళిని రక్షించడానికి యేసు సిలువ మరణం పొందాల్సివచ్చింది. ఆయన వైపు చూస్తే పాపికి ఆత్మీయ స్వస్థత లభిస్తుంది.

5. **క్రీస్తు సమరయలో ప్రదర్శించుకొనుట (4:1-42) :** యేసు సమరయ స్త్రీని సందర్శించిన ఈ ఉదాంతంలో ఆత్మలసంపాదనను గూర్చి అనేక ప్రయోగాత్మక సూచనలున్నాయి.

యేసు ఆమెతో వాదించలేదు. ఆమె సంభాషణ వాదనగా మారకుండ తెలివిగా అసలు అంశంవైపు త్రిప్పాడు. జీవజలమును గూర్చే పదే పదే చెప్పాడు చివరికి ఆమె దృష్టి తనపైననే కేంద్రీకరించబడేలా చేసాడు (4:26). వేదాంతపర విషయాలేమి చర్చించలేదు. ఆమె పాపజీవితాన్ని బట్టి అసహ్యించుకోలేదు, లేక కించపర్చలేదు. ఒక పురుషుని ఆత్మ ఎంత విలువైనదో స్త్రీ ఆత్మ కూడ అంతప్రశస్తమైనది. కనుక ప్రశ్నార్థకమైన జీవితం గల ఈ స్త్రీని యేసు దర్శించాడు.

క్రైస్తవులు తెల్లబారి కోతకు సిద్ధంగా ఉన్న పొలాలనే చూడాలని, విత్తేవారు నీళ్ళు పోసేవారు, కోసేవారు వేరే అయినా అభివృద్ధి కలుగజేసేవాడు దేవుడే అన్న సత్యాన్ని మరచిపోవద్దని యేసు జ్ఞాపకం చేసాడు. (I కొరి 3:5-9). ఈ సానుకూల దృక్పథం మనకు సేవలో ప్రోత్సాహాన్నిస్తుంది.

యేసు సుఖారను బావి వద్ద స్త్రీకి తనను గూర్చిన సాక్ష్యాన్నివ్వడం వలన సమరయులు అనేకులు ఆ స్త్రీ ద్వారా క్రీస్తునొద్దకు నడిపించబడ్డారు. (4:39). సమరయులు ప్రభువును స్వీకరించుట వలన సమరయలో ఆయనకు మంచి ప్రవేశం లభించింది. 4:46-54లో ఆయన చేసిన రెండవ సూచక క్రియ ఉన్నది.

## III. మూడవ భాగము - దైవ కుమారునికి ఎదురైన వ్యతిరేకత (5:1-12:50)

1. **యెరూషలేములో పండుగ సందర్భంలో వ్యతిరేకత (5:1-47) :** ఈ భాగంలో యేసు చేసిన మూడవ సూచక క్రియ ఉన్నది. బేతెస్థ కోనేటి వద్ద 38 సంవత్సరాల నుండి పడియున్న వ్యాధి గ్రస్తుణ్ణి ఆయన స్వస్థపరచినందు వలన అక్కడ ఆయనకు తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. అందుకు మూడు ప్రధాన కారణాలున్నాయి.

అ) యేసు ఆరోగిని విశ్రాంతి దినమున స్వస్థపరచాడు. (5:10-18)

ఆ) యేసు స్వభావములో (5:17,18) శక్తిలో (5:19-21) : అధికారములో (5:22-30) దేవునితో సమానుడని చెప్పుకొన్నాడు.

ఇ) ఆయన తన దైవత్వాన్ని నిరూపించే నాలుగు సాక్ష్యాధారాలను గూర్చి చెప్పాడు.

బాప్తిస్మమిచ్చు యోహాను సాక్ష్యం (5:31-35) ఆయన చేసిన క్రియల సాక్ష్యం (5:36) తండ్రి సాక్ష్యం (5:37,38) లేఖనాల సాక్ష్యం. (5:39-47).

2. **పస్కా సందర్భంలో గలిలయలో వ్యతిరేకత (6:1-71) :** యేసు ప్రభువు బేత్సయిదాకు సమీపంగా ఉన్న అరణ్యంలో బోధించాక ఐదువేల మందికి ఆహారం పెట్టుటను గూర్చి నాలుగు సువార్తలలోను పేర్కొనబడింది. కాని యోహాను సువార్తలో ఆయన చేసిన ఈ నాల్గవ సూచక క్రియ ద్వారా యేసు తాను జీవాహారముగా ప్రత్యక్షపరచుకొన్నాడు మరియు బహిరంగముగా ప్రకటించాడు.

అ) జనసమూహాలకు “జీవాహారము” గా ప్రకటించుట. (6:22-40) వాస్తవంగా, ప్రజలు అక్షయమైన ఆహారము కొరకు అన్వేషించాలన్న ఉద్దేశంతో ప్రభువు వారికి ఈ సత్యాన్ని వెల్లడించాడు. అందుకు వారు మన్నాను గూర్చి జ్ఞాపకం చేస్తూ, ఆయనను విశ్వసించడానికి సూచక క్రియను అడిగారు. (6:30). ఆయన అనుగ్రహించే ఆహారం లోకానికి జీవాన్ని ఇస్తుందని (6:33) ఆయన స్పష్టం చేసాడు.

ఆ) యూదులకు “జీవాహారము”గా ప్రకటించుట (6:41-59). యూదులు యోసేపు, మరియలను ఎరుగుదురు గనుక యేసు క్రీస్తు పరలోకం నుండి వచ్చాడన్న సత్యాన్ని నమ్మలేదు. (6:41-42) మన్నాకు మరియు తాను ఇచ్చే జీవాహారానికి గల తేడాను వారికి తెలుపుతూ, లోకానికి జీవిమిచ్చేందుకు త్వరలో తన శరీరాన్ని అర్పించ బోతున్నానని చెప్పాడు.

ఇ) శిష్యులకు “జీవాహారము”గా ప్రకటించుట (6:60-71). యేసు శిష్యులకు సహితం ఆయన మాటలు కఠినంగా అనిపించాయి. అభ్యంతరపడిఅనేకులు వెనుదీసారు. కాని ఆయన మాటలు ఆత్మయు జీవమునైయున్నవని స్పష్టంచేసాడు. విశ్వసించనివారెవరో, ఆయనను అప్పగింపబోవువారెవరో యేసుకు ముందుగానే తెలుసు. ఈ సందర్భంలో పేతురు ఒప్పుకోలు గంభీరమైనది. (6:68,69).

3. **పర్ణశాలల పండుగ సందర్భంగా యోరూషలేములో వ్యతిరేకత (7:1-10:21) :**

అ) యేసు సహోదరులు ఆయన బహిరంగముగా కనుపరచుకోవాలని కోరారు. అయితే ఆయన సమయం ఇంకా రాలేదని, ఆ సమయం వచ్చినప్పుడు అనగా తాను సిలువలో మరణించుట ద్వారా తనను గూర్చి అందరికి ప్రచురించబడుతుందని చెప్పాడు. ఆయన తన సహోదరులచే తృణీకరించబడతాడన్న ప్రవచనం అక్షరాల నెరవేరింది. (యెష 53:3; కీర్త 69:8; యోహా 1:11; 7:5) ఇది పండుగకు ముందు జరిగిన విషయం.

పండుగ మధ్యలో యేసు దేవాలయములోనికి వెళ్ళి బోధించాడు. ఆయన బోధను గూర్చి ఆశ్చర్యపడిన వారితో తాను ఆ బోధను తండ్రివలన పొందానని (7:14-24) అంత మాత్రమే కాదు తన ఉనికి తండ్రితో పాటు ఉన్నదని, ఆయన ద్వారా పంపిచంబడ్డాడని (7:25-32) తిరిగి తండ్రి వద్దకు వెళతాడని చెప్పాడు (7:33-36). ఈ సందర్భంగా



7:30 లో వ్రాయబడిన మాటలను బట్టి, దేవుని సేవకుడు తన జీవితంలో దేవుని చిత్తం నెరవేర్చబడేంత వరకు మరణానికి అప్పగింపబడడు అన్న సత్యం ప్రస్ఫుటమౌతుంది. (8:20; ప్రక 11:7 కూడ చదవండి).

ఇక పండుగ చివరి రోజు ఆయన ప్రజలకిచ్చిన ఆహ్వానం బహుగొప్పది “ఎవడైనను దప్పిగొనిన యెడల నా యొద్దకు వచ్చి దప్పి తీర్చుకొనవలెను.” (7:37). అనాదికాలం నుండి దేవుడు మనుష్యులకు ఇస్తున్న ఆహ్వానం ఇది. (యెష 55:1). మానవుల ఆత్మీయదాహం జీవజలమైన తన ద్వారానే తీర్చబడుతుందని, అలా ఆయనయందు విశ్వాసముంచిన వారిలో నుండి ఆ జీవజలనదులు ప్రవహిస్తాయని ఆయన చెప్పాడు. ఆయనను గూర్చి జన సమూహంలో విభేదాలు ఏర్పడ్డాయి. అంత మాత్రమే కాదు ఆయనను బట్టి సన్హెద్రిన్ సభలో కూడ కలవరం ఏర్పడింది. (7:45-530.

యేసు ఆనాటి ప్రజలకు వివాదాస్పదమైన వ్యక్తిగా ఉన్నాడు. కొంతమంది ఆయనను మంచివాడు అన్నారు, కొందరు కాదు ఆయన మోసగాడు అన్నారు (7:12), కొంత మంది ఆయన మంచి బోధకుడు అనుకున్నారు (7:14; 15, 46) ఆయన విశ్రాంతి దినాన్ని మీరేవాడని (7:19-25). ఆయన నిజంగా ఒక ప్రవక్త అని (7:40) ఆయనే మెస్సీయా అని కొందరు (7:31,41) ఇలా రకరకాలుగా ఆయనను గూర్చి తలస్తూ, తర్జన భర్జనలతో తలమునకలయ్యారు. ప్రియులారా! క్రీస్తునందు విశ్వాసముంచినవారు కూడ లోకానికి ఒక వింతగా, వేడుకగా ఉన్నారు. (I కొరి 4:9). లోక జ్ఞానము దేవుని జ్ఞానాన్ని, సత్యాన్ని అంగీకరించదు.

వాస్తవంగా పండుగ అంత్యదినాన జరిగించబడే ఆచారాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయన ఈ మాటలు చెప్పాడు. ఈ పండుగ జరిగే దినాలలో ప్రతిరోజు యాజకుడు సిలోయము కోనేరు నుండి ఒక గిన్నెలో నీళ్ళు తీసికొని వచ్చి దహనబలి పీఠంపై పోస్తాడు. అయితే దేవుడు అరణ్యంలో ఇశ్రాయేలీయుల అవసరాలు ఎలా తీర్చాడో తెలిపేందుకు చివరి రోజున అలా చెయ్యరు. మహాదినమైన అంత్యదినము, ఇశ్రాయేలీయులు వాగ్దాన భూమికి చేరుకొన్నారనడానికి సాదృశ్యంగా ఉంది. కనుక యేసు ప్రభువు ఒకవేళ పండుగ చివరి దినాన ఈ మాటలు చెప్పి ఉంటే, ఈ ఆచారము యొక్క నెరవేర్పుతానే అని అరణ్యంలో వాళ్ళకు నీళ్ళనిచ్చినది తానేనని, తానే జీవజల ప్రధాత అని నిర్ధారించుకొన్నాడన్న మాట (యోహా 4:10; I కొరి 10:4).

కాని వాస్తవంగా ఆయన తాను అనుగ్రహించబోయే పరిశుద్ధాత్మను గూర్చి చెప్పాడు (7:37-39). తన ఆరోహణాన్ని గూర్చి కూడ ఆయన ప్రస్తావించాడు (7:33,34).

**ఆ) వ్యభిచారమందు పట్టబడిన స్త్రీ (8:1-11) :** ఈ సంఘటన పర్ణశాలల పండుగ అనంతరం, అనగా మరునాడు జరిగింది. ఆయన మానవులను ధర్మశాస్త్రము యొక్క శిక్షనుండి తప్పించడానికి వచ్చాడని ఈ భాగం స్పష్టం చేస్తుంది. (లేవీ 20:10; ద్వితీ 22:23,24 ను రోమా 8:1-4తో పోల్చండి)

8వ అధ్యాయంలో ఆయన తాను లోకానికి వెలుగునని ప్రకటించుకొన్నాడు. (8:12) తన మరణాన్ని గూర్చి (8:28) మరియు ఆరోహణమును గూర్చి (8:14,21) పునః ప్రస్తావించాడు. దేవుని వాక్యం అనగా సత్యము వారిని స్వతంత్రులనుగా చేస్తుందని, దానిలో నిలుకడగా ఉండాలని చెప్తూ, (8:31,32). అపవాది సంబంధులను గూర్చి బోధిస్తూ, తాము అబ్రాహాము సంబంధులమని చెప్పుకొంటున్న ఇశ్రాయేలీయులను ఖండించాడు. (8:33-59) ఎందుచేతనంటే వారు అబ్రాహాము పిల్లలమని చెప్పుకొంటున్నారుగాని వారి తండ్రి క్రియలు చేయడంలేదు. యేసు ఈ సందర్భంగా తాను శాశ్వత కాలము నుండి ఉన్నవాడని నిరూపించాడు (8:58). అందును బట్టి ఆయన పైనున్న వ్యతిరేకత మరింత తీవ్రరూపం దాల్చింది. వారు ఆయనను రాళ్ళతో కొట్టి చంపాలనుకొన్నారు. (8:59).

ఇ) **పుట్టుగ్రుడ్డి వానిని స్వస్థపరచుట (ఆరవసూచక క్రియ) (9:1-41) :** 9వ అధ్యాయంలో 40 యేళ్ళ వయస్సుగల పుట్టు గ్రుడ్డివానిని స్వస్థపరచుట ద్వారా యేసు తాను లోకానికి వెలుగునని ప్రకటించాడు. దేవుని క్రియలు వానియందు ప్రత్యక్షపరచబడడానికే అతడు గ్రుడ్డివానిగా పుట్టాడని యేసు చెప్పిన మాటలలో గంభీరమైన సత్యం ఉన్నది. మనకు, మరి విశేషంగా నీతిమంతులకు ఎందుకు శ్రమలు వస్తాయి అనే ప్రశ్నకు ఇది జవాబు. దేవుని క్రియలను ప్రత్యక్ష పరచడమే మానవ జీవిత లక్ష్యం. దానిని ఎలా చేయాలో యేసు తన చివరి ప్రార్థన ద్వారా చూపించాడు. (యోహా 17:4).

యేసును మెస్సీయాగా నిరూపించడానికి, ఆయనను గూర్చిన ప్రవచనాలు నెరవేర్చబడ్డాయని సూచిస్తూ (యెష 35:5) యోహాను ఈ సూచక క్రియను తన సువార్తలో పొందుపర్చాడు. (యోహా 20:30,31 చదవండి). ఈ సందర్భంలో ప్రభువు పగలున్నంత వరకు మనల్ని పంపినవాని క్రియలు చేయాలన్న సత్యాన్ని కూడ బోధించాడు. (9:4) గ్రుడ్డి వాని స్వస్థత మరల మత పెద్దలతో చర్చకు కారణమైంది. వారికి భౌతికంగా దృష్టి ఉన్నది కాని ఆధ్యాత్మికంగా గ్రుడ్డివారు. ప్రియ పాఠకులారా! ప్రతి మనుష్యుని వెలిగించే ఆయనలోని జీవమును మీరు విశ్వాసం ద్వారా పొందారా? ఆయనతో వెలుగులో నడుస్తున్నారా? లేక ఆనాటి మతనాయకుల వలె యేసును తృణీకరిస్తున్నారా?

ఈ) **మంచికాపరి (10:1-21) :** యేసు స్వస్థపరచిన ఈ గ్రుడ్డివానిని సమాజ మందిరము నుండి వెలివేసారు. ఈ సందర్భంలో యేసు తాను మంచికాపరిని అని ప్రకటించుకొన్నాడు. ఆయనకు ముందు వచ్చిన వారందరు దొంగలు, దోచుకొనువారు. యోహాను తొమ్మిదవ అధ్యాయంలో యూదులు ఈ మంచి కాపరి స్వరాన్ని వినలేదు. ఒక్క గ్రుడ్డివాడే ఆయన స్వరాన్ని విని ఆయనను వెంబడించాడు. యూదులు అతణ్ణి వెలివేసామనుకొన్నారు. కాని యేసు అతణ్ణి యూదామత తత్వము నుండి వెలుపలికి పిలిచాడు.

ఈ ఉపమానంలో రెండో భాగం, గొఱ్ఱెలు లోపలికి వెళ్తూ, బయటికి వస్తూ మేత మేయడమును గూర్చి చెప్తుంది. రక్షించబడిన వారు సంఘమనే దొడ్డిలోనికి వెళ్తూ



సమాజములోనికివెలుపలికి వస్తూ క్రీస్తు కొరకు జీవించేందుకు, ఆయనను సేవించేందుకు కావలసిన సమస్తమును కనుకొంటారు. (ఎఫె 4:12).

**4. ఆలయ ప్రతిష్ఠ పండుగ సందర్భముగా యోరూషలేములో వ్యతిరేకత (10:22-42) :**
యేసు ఈ సువార్త అంతటిలోను, తాను ఏదీ స్వయంగా చేయడం లేదని, తాను చేసే ప్రతి క్రియకు, మాట్లాడే ప్రతి మాటకు తండ్రే మూలాధారమని చెప్పాడు. అయితే తన ప్రాణమును ఆయనే స్వయంగా ఫణంగా పెడుతున్నాడని దానిని పెట్టుటకు మరియు తిరిగి తీసికొనుటకు తనకు అధికారం ఉందని స్పష్టం చేసాడు (10:15-19) అలా తనకు తండ్రితో గల ఐక్యతను గూర్చి చెప్పడం వలన (10:30) యూదులు ఆయనను దేవదూషకునిగా ఎంచి పట్టుకోజూసారు (10:31-39).

**5. బేతనియలో వ్యతిరేకత (11:1-12:11) :**
ఈ భాగంలో యేసు చేసిన 7వ సూచక క్రియ (11:1-44) పరిసయ్యుల కుట్ర (11:45-57) మరియు యేసును అభిషేకించుటను గూర్చి (12:1-11) వ్రాయబడింది.

యోహాను 11వ అధ్యాయంలో మానవులు పరిష్కరింపలేని జీవిత సమస్యలైన వ్యాధి మరియు మరణమును గూర్చి చెప్పబడింది. బేతనియలోని లాజరుకు జబ్బు చేసిందన్న వర్తమానం అందేసరికి యేసు అరణ్యంలో ఫలభరితమైన పరిచర్య చేస్తూ ఉన్నాడు. ఈ దశలో యేసు యోరూషలేములోని పెద్దల ద్వారా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నాడు. బాప్తిస్మమిచ్చు యోహాను ఆయనను గూర్చి చెప్పిన విషయాలు సత్యమైనవని గ్రహించిన ప్రజలు ఆయన యందు విశ్వాసముంచారు. (10:40-42).

లాజరుకు వచ్చిన వ్యాధికి కారణం అతణ్ణి నిత్యరాజ్యంలోనికి తీసికొనిపోయేది మాత్రమే కాదు గాని అతని వ్యాధి, మరణం వలన దేవుడు మరియు దేవుని కుమారుడైన యేసు మహిమ పరచబడ్డారు. మరి మార్తలు తమ సోదరుని మరణమును బట్టి స్పందించిన విధానం ముఖ్యాంశం. మనల్ని ముంచివేసే సమస్యల పట్ల మనం స్పందించే తీరులో, మనకు ప్రభువుకు మధ్యగల సంబంధం ప్రధానమైనది. క్రీస్తుతో మనకు ఉన్న సంబంధం, ఆయన ప్రేమ పట్ల మనకున్న చెదరని విశ్వాసమే మన ప్రతి స్పందనగా ఉండాలని మరియ స్పందన మనకు జ్ఞాపకం చేస్తున్నది. ఈ సందర్భంలో యేసు మరొకసారి తనను బయలుపరచుకొన్న విధానం, మనందరి విశ్వాసానికి, నిరీక్షణకు ఆధారమైని. "పునరుత్థానమును జీవమును నేనే. నా యందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును. బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడు ఎన్నటికిని చనిపోడు." (11:25,26).

ఈ భాగంలో పునరుత్థాన జీవాన్ని గూర్చిన గొప్ప ప్రకటన ద్వారా తనకు విశ్వాసికి మధ్యగల నిబంధనను తెలియజేస్తున్నాడు. ఆయన నిబంధనలో తన వంతు నెరవేరుస్తానని వాగ్దానం చేస్తున్నాడు. అయితే ఈ నిబంధనలో ప్రవేశించే వ్యక్తి రెండు షరతులు నెరవేర్చాలి.

అతడు యేసునందు విశ్వాసముంచాలి మరియు ఆయన యందు జీవించాలి. అప్పుడే ఆయన అనుగ్రహించబోయే విడుదల కొరకు కనిపెట్టగలుగుతాము. (Iథెస్స 4:13-18).

యేసు బేతనియలో చేసిన ఈ అద్భుత కార్యం వలన యూదులు అనేకులు ఆయనయందు విశ్వాసముంచారు (11:45) అయితే యూదా మతనాయకుల ప్రతికూల ప్రతిస్పందన ఇప్పుడు మరింత తారస్థాయికి చేరింది (11:46,47). వారు యేసును చంపడానికి వ్యూహం పన్నారు. యోహాను 12:1-11 వచనాలలో మరియ మార్తలు తమకున్న వరాలను, వారికి కలిగిన పిలుపును మరియు ప్రాధాన్యతలను ఆరాధన సంబంధమైన విలువైన అర్పణగా ఆయన పాదాల వద్ద సమర్పించారు.

**6. యోరూషలేములో వ్యతిరేకత (12:12:50) :**

**అ. యేసు యోరూషలేములోనికి జయప్రవేశం (12:12-22) :** ఈ భాగముతో మూడు సంవత్సరాల పాటు సాగిన యేసు బోధ, ఉపదేశము, స్వస్థత, అపొస్తలుల శిక్షణ ముగియబోతున్నాయి. మరియు ఆయన జీవితంలో ముఖ్యమైన వారము ప్రారంభంకాబోతున్నది. ఆయన యెరూషలేములోనికి ప్రవేశించినప్పుడు లోకము ఆయనను వెంబడించింది. పరిసయ్యుల ప్రయత్నాలు నిష్ప్రయోజనమయ్యాయి. (12:12-19).

యేసు పరలోకం నుండి ఈ లోకానికి వచ్చిన రాయబారిగా ఈ లోక ఆధ్యాత్మిక కేంద్రమైన యెరూష లేములోనికి వెళ్ళాడు. నిద్రిస్తున్న వారిని మేల్కొలిపి ఈ లోకంలో దేవుని సంకల్పము నెరవేర్చడానికి పాలిభాగస్తులుగా చేయాలన్నదే ఆయన ఉద్దేశం.

ఆ. మెస్సీయా బోధ (12:23-50) : యేసును చూడాలని గ్రీసు దేశస్థులు వచ్చినప్పుడు ఆయన చెప్పిన మాటలు ఆయన జీవిత ఉద్దేశాన్నంతా వివరిస్తున్నాయి. ఆయన గడియ సమీపించినదని అర్ధమౌతుంది. ఇక్కడ ఆయన ఒక ఆత్మసంబంధమైన సత్యాన్ని ప్రకృతి సబంధమైన నియమముతో పోల్చి చెప్పాడు. "గోధుమ గింజ భూమిలో పడి చావకుండిన యెడల అది ఒంటిగానే యుండును, అది చచ్చిన యెడల విస్తారముగా ఫలించును. (12:24). ఈ సూత్రాన్ని ఆయన మొదట తనకు అన్వయించుకొన్నాడు. తరువాత తన శిష్యులని చెప్పుకొనే ప్రతి ఒక్కరికీ వర్తింపజేస్తున్నాడు. జీవితాన్ని గూర్చిన ముఖ్యసూత్రాన్ని 12:25 లో తెలియజేసాడు. మన ప్రాణాన్ని మనం కాపాడుకోలేము. కాని దానిని ప్రభువు కొరకు వెచ్చిస్తే నిత్యత్వం కొరకు దానిని కాపాడుకొంటాము. (12:48-50) యేసు చెప్పిన బోధ అంతా దేవుని వాక్యమే గనుక మనము ఆయన వాక్యాన్ని నిరాకరించినా లేదా అన్వయించుకోవడంలో విఫలులమైనా, ఆ వాక్యమే మనకు తీర్పు తీరుస్తుంది.

## IV. నాల్గవ భాగము - దైవకుమారుడు శిష్యులను సిద్ధపరచుట (13:1-17:26) :

**1. మేడగదిలో సిద్ధపాటు (13:1-14:31) :** ఈ భాగములో క్రీస్తు తన శిష్యుల పాదాలను కడుగుట (13:1-20) యూదా ద్రోహమును గూర్చి (13:21-30) తన ఆరోహణమును (13:31-35) మరియు పేతురు బొంకుటను గూర్చి (13:36-38) చెప్పుట; శిష్యులను ఆదరించుట (14:1-4) తోమా, ఫిలిప్పు మరియు యూదా ప్రశ్నలకు జవాబిచ్చుట (14:5-31) మొదలైన అంశాలున్నాయి.

**2. గెత్సేమనే తోటకు వెళ్ళే మార్గంలో సిద్ధపాటు (15:1-7:26) :**

అ. క్రీస్తు శిష్యులకు ఉపదేశించుట : ఈ భాగంలో యేసుక్రీస్తు తనకు విశ్వాసులకు గల సంబంధాన్ని గూర్చి (15:1-11) విశ్వాసులకు ఒకరితో మరొకరికి గల సంబంధాన్ని గూర్చి (15:12-7) విశ్వాసులకు లోకముతో గల సంబంధాన్ని గూర్చి (15:18-25) చెప్పాడు. పరిశుద్ధాత్మను గూర్చి వాగ్దానం చేసాడు (15:26-16:15). ఆలాగే తన మరణ పునరుత్థానాలను గూర్చి చెప్పాడు (16:16-33).

ఆ. క్రీస్తు తన తండ్రిని వేడుకొనుట (17:1-26) : మన గొప్ప ప్రధానయాజకునిగా యేసు చేసిన ఈ విజ్ఞాపన ప్రార్ధనలో తన కొరకు (17:1-5) తన శిష్యుల కొరకు (17:6-19) మరియు తనయందు విశ్వాసముంచేవారందరి కొరకు (17:20-26) వేడుకొన్నాడు.

ఈ విజ్ఞాపన ప్రార్థనను బట్టి, యేసు ఉనికి లోకము పుట్టక ముందే ఉన్నదని ఆయన త్రిత్వంలో ఒకరని అర్ధమౌతున్నది. (17:5) 24వ వచనంలో యేసుకు శిష్యుల పట్ల గల ఉద్దేశం స్పష్టం చేయబడింది. ఆ పదకొండు మంది శిష్యులకు తన మహిమను అనుగ్రహించినట్లే, ఆయన తిరిగి వచ్చేంత వరకు ఆయనను ప్రభువుగా రక్షకునిగా అంగీకరించే వారికందరికి తన మహిమను అనుగ్రహించే కార్యాన్ని కొనసాగిస్తాడని మనం నమ్మవచ్చును. ఆయన తన ప్రార్థనలో లోకమును కూడా గురిగా పెట్టుకొన్నాడు. తాను లోకం కొరకు ప్రార్ధించడం లేదని తండ్రితో చెబుతూ ఉన్నప్పటికిని, ఆ ప్రార్ధనలో లోకాన్ని గూర్చి 19 సార్లు ప్రస్తావించాడు. ఈ దివ్యమైన ప్రార్థనకు దేవుడు జవాబిచ్చాడు అపొస్తలుల ద్వారా లోకాన్ని చేరడానికి తన కుమారుడు రూపొందించిన పథకాన్ని దీవించాడు.

## V. ఐదవ భాగం - దేవుని కుమారుని సిలువ మరణము మరియు పునరుత్థానము (18:1-21:25) :

**1. క్రీస్తు బంధించబడుట మరియు తీర్పుతీర్చబడుట (18:1-19:16) :** క్రొత్త నిబంధనలోని ఈ నాలుగవ సువార్తలో సగం అధ్యాయాలలో ఆయన మరణ పునరుత్థాలను గూర్చిన సమగ్ర నివేదిక ఉన్నది. యేసు లేఖనాన్ని మరియు తాను ఈ లోకానికి రావడానికి కారణమైన గడియను నెరవేరుస్తున్నాడని యోహాను పేర్కొన్నాడు (18:1-11) యేసుకు తనకు సంభవింప నైయున్న సమస్తము తెలుసు. అయినా తన శిష్యుల ప్రాణాలను కాపాడుతూ తాను లేఖనాలను నెరవేర్చాడు.

యేసు మనుష్యుని కంటె అధికుడనే సత్యాన్ని కూడ యోహాను ఎడతెగక చెబుతున్నాడు. "నేనే ఆయనను" అని చెప్పినప్పుడు ఆయనను బంధించడానికి వచ్చినవారు వెనుకకు తగ్గి నేల మీదపడ్డారు. ఇక్కడ పేతురు స్పందించిన విధానమును బట్టి, శత్రువులను ప్రేమించాలని

యేసు చెప్పిన ఉపదేశాన్ని (మత్త 5:39,44) వర్తింపజేయగల శక్తి పేతురులో లేదని అర్థమౌతుంది. పరిశుద్ధాత్మ శక్తిని పొందాక పేతురు ఆ విధంగా చేయగలిగాడు. యేసును మొదట మాజీ ప్రధాన యాజకుడైన అన్న యెదుట (18:12–23) తరువాత కయప యెదుట (18:24–27) తరువాత పిలాతు యెదుటకు రెండు పర్యాయాలు (18:28–19:16) తీర్పు కొరకు తీసికొని వెళ్ళారు.

యూదులు రోమా ప్రభుత్వ ఆధీనంలో ఉన్నా మతసంబంధమైన విచారణలు జరుపుకొనే అనుమతి ఉన్నది. అయితే వారు యేసును సిలువ వేయగోరినందువలన రోమా గవర్నరు పొంతి పిలాతు యెదుట కూడ విచారణ జరిగించబడింది. మెస్సీయా అయిన యేసు మరణము ప్రవచనాత్మకంగా జరుగుతున్నదని యోహాను వ్యాఖ్యానించాడు (18:29–32) పిలాతు జరిగించిన రెండవ విచారణలో వారిద్దరి మధ్య గంభీరమైన సంభాషణ జరిగింది. ఈ సందర్భంలో యేసు ఈ లోకంలో తన కార్యాన్ని గూర్చి ఒక గంభీరమైన ప్రకటన చేసాడు. "సత్యమును గూర్చి సాక్ష్యమిచ్చుటకే నేను ఈ లోకమునకు వచ్చాను" (18:37). యేసులో నేరారోపణకు తగిన ఏ ఆధారము కనిపించకున్నా ఆయనను సామాన్య నేరస్తుని వలె కొట్టించి, "ఇదిగో ఈ మనుష్యుడు" అని వారి యెదుట నిలబెట్టాడు. (19:5). బహుశా యూదా మతనాయకులలో కరుణాకటాక్షాలను రేకెత్తించాలని యేసును విడుదల చేయాలని పిలాతు ప్రయత్నించి ఉంటాడు. కాని యూదులు అతనిపై రాజకీయపరమైన ఒత్తిడిని తెచ్చినప్పుడు (19:12) వారి కోరికను కాదనలేక పోయాడు. న్యాయరీత్యా మరియు విచారణ రీత్యా పిలాతు యేసును గూర్చిన సత్యాన్ని తెలిసికొన్నప్పటికిని, అతడు నమ్మలేదు. ఈనాడు లోకం యావత్తు సత్యం కోసం చూస్తున్నది. సత్యము యేసుక్రీస్తులోనే దొరుకుతుంది. జీవము అంటే సత్యమైయున్న యేసుతో సంబంధం కలిగియుండడమే.

2. **క్రీస్తు సిలువ వేయబడుట (19:17–37) :** యోహాను తన సువార్త అంతటా ప్రస్తావించిన గడియను యేసు ఎదుర్కొన్నాడు. ఆయన ఈ లోకంలోనికి రావడంలోని ముఖ్య ఉద్దేశం అదే. (3:14–21; 12:23; 17:1). రోమీయులు తాము జయించినవారిని, తమపై తిరుగుబాటు చేసినవారిని, పన్ను కట్టని వారిని వేలాది సంఖ్యలో సిలువవేసారు. కాని దేవుని గొఱ్ఱె పిల్లగా సిలువవేయబడిన యేసు మరణం మాత్రమే మానవుల పాపాలకు ప్రాయశ్చిత్తం చేసింది. యేసు సిలువపై పలికిన మాటలలో మూడింటిని యోహాను తన సువార్తలో పేర్కొన్నాడు (19:25–30). "సమాప్తమైనది" అని ఆయన పలికిన మాట మనము పాపక్షమాపణను, దేవునితో సమాధానపరచబడుటకు గూర్చిన నిశ్చయత కలిగి ఉండేందుకు దోహదపడుతున్నది. ఆయన సిలువపై మన నిమిత్తం నెరవేర్చినదానికి అదనంగా మనమేమి చేర్చనవసరం లేదని అర్థం (హెబ్రీ 7:27; 10:12). ఆయన ప్రాణాన్ని ఎవరూ ఆయన నుండి తీసివేయలేదు అనే సత్యాన్ని "ఆయన తలవంచి ఆత్మను అప్పగించెను" అనే మాటల ద్వారా యోహాను వ్యక్తపర్చాడు. (10:18; 19:30).



3. **క్రీస్తు భూస్థాపన (19:38-42) :** పందొమ్మిదవ అధ్యాయం చివరి భాగంలోని ఇద్దరు వ్యక్తులు అనగా అరిమతయి యోసేపు మరియు నీకొదేము సన్హెద్రిన్ సభ్యులు. రహస్య విశ్వాసులైనవారు, యేసుకు మరణ శిక్ష విధించినప్పుడు మాట్లాడలేకపోయారు గాని ఆయన మరణం వారి విశ్వాసాన్ని బహిరంగముగా ఒప్పుకొనే స్థాయికి తెచ్చింది.

4. **క్రీస్తు పునరుత్థానము మరియు ప్రత్యక్షతలు (20:1–21:25) :** సువార్తలో క్రీస్తు మరణం మరియు పునరుత్థానం రెండూ ప్రాముఖ్యమైనవే. 20వ అధ్యాయంలో మూడు సంఘటనలు వ్రాయబడ్డాయి. మొదటిది ఆదివారం ఉదయం యేసుకు సన్నిహితులైనవారు ఖాళీ సమాధిని చూడడము. రెండవ సంఘటన అదే రోజు సాయంత్రము జరిగింది. మూడవది ఒక వారము తరువాత జరిగింది. ఈ అధ్యాయం చివరిలోని తుది పలుకులు యోహాను సువార్త వ్రాయబడటలోని ఉద్దేశాన్ని తెలుపుతున్నాయి. (20:30,31).

21:1–14 లో ఆయన 7 గురు శిష్యులకు కనిపించుట, పేతురుతో మాట్లాడుట (21:15–23) తో ఈసువార్త ముగుస్తుంది. యేసు పేతురును "నీవు నన్ను ప్రేమిస్తున్నావా?" అని మూడు సార్లు ప్రశ్నించాడు. పేతురు తన విరిగి నలిగిన స్థితిని ఒప్పుకొన్నప్పుడు యేసు తన గొఱ్ఱెలను మేపే బాధ్యతను అతనికి అప్పగించాడు. ఈ వ్యక్తి ద్వారా పెంతెకొస్తు దినాన పునరుత్థానుడైన క్రీస్తు తన మహాశక్తిని ప్రదర్శించాడు (అపొ 2 అధ్యా). యేసు తన శిష్యులకు, మనకు చెప్పిన మహా ఆదేశానికి మనము లోబడితే మన వ్యక్తిగత జీవితాల పట్ల దేవుని సంకల్పాన్ని మరియు సంఘం నిమిత్తం ఆయన సమిష్ఠి సంకల్పాన్ని కనుగొంటాం. (21:18–23) అట్టి కృప ప్రభువు మనకు దయచేయునుగాక.


## ప్రేమధార పాఠకులకు ఒక విజ్ఞప్తి

భారత దేశములో గత 30 సంవత్సరములుగా రేడియో ద్వారా సువార్తను ప్రకటిస్తున్న ట్రాన్స్ వరల్డ్ రేడియో – ఇండియా (టి.డబ్ల్యు.ఆర్–ఇండియా) దర్శనం ప్రకారం రేడియో ద్వారా సువార్త ప్రకటించి, రక్షించబడిన వారిని సంఘాలలో బలపర్చాలని, సామాజిక వికాస పథకాల ద్వారా సమాజాన్ని రూపాంతరపర్చాలని ఆశిస్తున్నాం. అందుకు మీ ప్రార్థన, ఆర్థిక సహకారాలు ఎంతైన అవసరం. ఈ రేడియో కార్యక్రమాలను మీ బంధువులకు, స్నేహితులకు, ఇరుగు పొరుగు వారికి పరిచయం చేయండి. ఇక నుండి రేడియో పరిచర్య నిమిత్తం మీరు పంపించే విరాళాలు (చెక్కు/డిమాండ్ డ్రాఫ్ట్/మనియార్డర్) "ట్రాన్స్ వరల్డ్ రేడియో–ఇండియా" (Trans World Radio - India) పేరు మీద తీసి మా చిరునామాకు పంపించవలసినదిగా మనవి చేస్తున్నాము. ప్రభువు మీకిచ్చిన ధనాన్ని విలువైన దాని కొరకు పెట్టుబడిగా పెట్టి నిత్యత్వంలో అధిక లాభాన్ని పొందాలని ఆశిస్తున్నాం. ప్రభువు మిమ్మల్ని, మీ కుటుంబాన్ని సమృద్ధిగా దీవించునుగాక! ఆమేన్!!



**TTB - Telugu - Study Outlines - Gospel of John**

Printed by : Premadhara, Trans World Radio - India, 12-1-334/17/3,
Lalapet, Secunderabad - 500 017. Ph : 040-27003011.

**FREE** MP3 DOWN LOAD - Log on to :
**www.radio882.com**